క్లుప్తంగా

యోగాపై వ్యాసరచన పోటీలు

కడప కల్చరల్‌ : జూన్‌ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా కడప నగరంలోని విశ్వాత్మ పిరమిడ్‌ యోగా రీసెర్చ్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జీవీఎస్‌ రెడ్డి తెలిపారు. జూన్‌ 6వ తేదీలోపు వ్యాసరచన పోటీ కోసం రచనలు పంపాలని డాక్టర్‌ డి.ఊర్మిలాదేవి సూచించారు. వ్యాసరచనతోపాటు పాస్‌పోర్టు సైజ్‌ ఫోటోలు అభ్యర్థులు ఈ చిరునామాకు పంపాలన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలను కూడా బహూకరించనున్నట్లు తెలిపారు. వివరాలకు 8074826819 నెంబరులో సంప్రదించాలన్నారు.

అన్నదానం



హిమవర్షిణి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్న దాతలు

కడప అర్బన్‌: జిల్లాలోని ఎర్రగుంట్ల వాసి ఎర్రం రెడ్డి రామ్మోహన్‌ రెడ్డి కుమార్తె ఏపీఎస్‌ఆర్టీసీ కడప డిపో ఉమెన్‌ కానిస్టేబుల్‌ ఎర్రం రెడ్డి వీర శ్వేతా రెడ్డి జన్మదిన సందర్భంగా వీరి తల్లి ఎర్రం రెడ్డి సూర్య లక్ష్మీదేవి హిమ వర్షిణి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఎల్‌ఐసి క్వార్టర్‌ దగ్గర ఉండే స్నేహాలయ నిరాశ్రయుల నివాస వసతి గృహంలో , జిల్లా పరిషత్‌ దగ్గర ఉండే ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కానిస్టేబుల్‌ గుండ్లకొండ రవి, రెడ్డి లక్ష్మణ్‌, పుట్టా పురుషోత్తం, వెంకట సురేష్‌ బాబు, దామోదర్‌, ఎలక్ట్రిషన్‌ మధు, బద్రి, ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

మహిళపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న వివిధ పార్టీలు, సంఘాల ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : జిల్లాలోని వేంపల్లె మండలంలో గిరిజన ఎరుకుల మహిళపై దాడి చేసిన వారిపై సత్వరమే చర్యలు తీసుకోవాలని పలు పార్టీలు, సంఘాల ప్రతినిధులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్దగల రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బాబా సాహెబ్‌ అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ఎరుకుల సామాజిక వర్గాలపై దాడులు రోజురోజుకు అధికమయ్యాయన్నారు. ఇప్పటికైనా ఆయా దాడులను అరికట్టేందుకు తగిన చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్‌ ఆంజనేయులు, బీజేపీ జిల్లా అధ్యక్షులు సగిలి గుర్రప్ప, ఏఐవైహెచ్‌పీఎస్‌ స్టేట్‌ సెక్రటరీ శ్రీనివాసులు, బీసీ యునైటెడ్‌ ఫ్రండ్‌ అధ్యక్షులు డీఎం ఓబులేశు, న్యాయవాది రత్నకిశోర్‌, లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు దేవర శ్రీకృష్ణ పాల్గొన్నారు.

పండిట్‌ నెహ్రూ సేవలు మరువలేనివి



జవహర్‌లాల్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: భారత దేశ మొదటి ప్రధాని పండిట్‌ జవహర్‌లాల్‌ నెహ్రూ దేశానికి చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివని డీసీసీ ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్‌, కదిరి ప్రసాద్‌ పేర్కొన్నారు. మంగళవారం నెహ్రూ వర్ధంతి సందర్భంగా నగరంలోని కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకులు అబ్దుల్‌ సత్తార్‌, మైనార్టీ రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ఖాదర్‌ ఖాన్‌, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమాల్‌ బాష, ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, క్రిస్టియన్‌ మైనార్టీ జిల్లా అధ్యక్షులు పి.డి. సంజయ్‌ కాంత్‌ , కేకేసి జిల్లా ఉపాధ్యక్షులు ఫైరోజ్‌ హుస్సేన్‌, శ్యామలమ్మ , నాగరత్న గౌడ్‌, హమీద్‌, సిద్దిక్‌, ఇనాం పాల్గొన్నారు.

జిరాఫీ చెస్‌ పోటీలు

ప్రొద్దుటూరు : అనిబిసెంట్‌ మున్సిపల్‌ హైస్కూల్‌ ఆవరణలోని పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో మంగళవారం జిరాఫీ చెస్‌ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొంటున్న 50 మంది విద్యార్థుల మధ్య జిరాఫీ చెస్‌ పోటీలు నిర్వహించారు. జీవన జ్యోతి హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న శ్రీవిద్య విన్నర్‌గా, సెయింట్‌ జోసెఫ్‌ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న సంతోష్‌ రన్నర్‌గా నిలిచారు.

కాలభైరవస్వామికి పూజలు



విశేష అలంకారంలో శ్రీ కాలభైరవస్వామి



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్‌ : కడప నగర శివార్లలోని శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవస్వామి ఆలయంలో అమావాస్య విశేష కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు శ్రీధర్‌శర్మ మంగళవారం ఉదయం నుంచి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం నిర్వహించారు. అనంతరం విశేష పూజల్లో భాగంగా అష్టోత్తరం నిర్వహించారు. భక్తులు స్వయంగా పూజ కోసం తెచ్చిన కుష్మాండ దీప సేవారాధనలో విశేష సంఖ్యలో పాల్గొని గుమ్మడి కాయలు సమర్పించి వాటిపై దీపారాధన చేశారు. బాసట స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు డీఏ కార్తీక్‌రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

అగస్త్యేశ్వరునికి భస్మార్చన



ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అమావాస్య సందర్భంగా స్వామికి ఘనంగా భస్మార్చన నిర్వహించారు. స్వామి వారికి వేద పండితులు ప్రదోష కాల సమయంలో పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్య, రుద్రాభిషేకం నిర్వహించి సహస్ర నామార్చన, భస్మార్చన నిర్వహించి భస్మహారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

విజయదుర్గమ్మా.. దీవించవమ్మా..



రాహుకాల పూజల్లో పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్‌ : కడప నగరంలోని విజయదుర్గ ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఐదు రోజులపాటు మాలధారణ..

కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో బుధవారం నుంచి ఐదు రోజులపాటు శ్రీ విజయదుర్గమ్మ దీక్ష మాలధారణ నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. ఐదు రోజులపాటు ఆలయంలో మండల దీక్ష మాలధారణ చేయనున్నారని, భక్తులు అమ్మవారి మాలధారణ వేసుకోవచ్చని తెలిపారు. జూన్‌ 8న శ్రీ విజయదుర్గ, మల్లికార్జునుల కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు. అలాగే 11న పౌర్ణమిని పురస్కరించుకుని విజయదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకం, చండీహోమం, దీపాలంకార సేవ తదితర పూజోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని ఆలయ వ్యవస్థాపకులు మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్‌లు తెలిపారు.

సీఎస్‌ఐ చర్చికి నూతన కార్యవర్గం

కడప కల్చరల్‌ : కడప నగరంలోని సీఎస్‌ఐ సెంట్రల్‌ చర్చికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా సెంట్రల్‌ కేటగిరి విభాగంలో పి.మనోహర్‌బాబు, కె.జయవరప్రసాద్‌, పి.డేనియల్‌, డి.జాన్‌, సుకేష్‌లను ఎన్నుకోగా, మహిళా విభాగంలో శ్రావణి, దినకర్‌, వి.శైలజమ్మ, పి.సౌజన్యలను ఎన్నుకున్నారు. వీరితోపాటు యువత విభాగంలో జే.షారోన్‌ కృపాకర్‌, డాక్టర్‌ జి.హారిక, మ్యాథోజో ఎన్నికయ్యారు. వీరితోపాటు నలుగురు జనరల్‌ కేటగిరీలోనూ, ముగ్గురు మహిళా కేటగిరిలోనూ, మరోముగ్గురు యూత్‌ కేటగిరీలోనూ ఎన్నికయ్యారు. పాస్టర్‌ రెవరెండ్‌ విక్టర్‌ రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన వారు మూడు సంవత్సరాలపాటు పదవిలో కొనసాగనున్నారు. వీటితోపాటు జనరల్‌ కేటగిరీలో డి.దేవ శిఖామణి, ఎస్‌.డేవిడ్‌ ఇమ్మానియల్‌, కిస్సీ వాట్కిన్స్‌లు ఎంపిక కాగా, టి.పంకజ రవికుమార్‌, కె.రాణి వివేకం, ఎం.జ్యోతి మహిళా కేటగిరీలో ఎన్నికయ్యారు. ఇ.ఎస్తేర్‌ రూబి వేదం, పి.జాకోబ్‌ శ్యామేల్‌, డీసీ పవిత్రలను యూత్‌ కేటగిరీలో ఎన్నుకోగా, వీరిలో ఎస్‌పీజీ క్రైస్ట్‌ చర్చి పాస్టర్‌గా రెవరెండ్‌ పీఎస్‌ స్వరూప్‌లను ప్రకటించారు.

మోడల్‌ మెగా డీఎస్సీ విజయవంతం



ఆర్‌ఎస్‌ఎఫ్‌ నాయకులతో కలిసి డీఎస్సీ ప్రశ్నాపత్రాన్ని విడుదల చేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు

కడప ఎడ్యుకేషన్‌: కడప జిల్లావ్యాప్తంగా ఆర్‌ఎస్‌ఎఫ్‌ మంగళవారం నిర్వహించిన మోడల్‌ మెగా డీఎస్సీ పరీక్ష విజయవంతంగా జరిగిందని ఆర్‌ఎస్‌ఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షులు డి. ఎం. ఓబులేసు యాదవ్‌, వెంకట సాయి కోచింగ్‌ సెంటర్‌ డైరెక్టర్‌ టక్కోలి దామోదర్‌ రెడ్డి అన్నారు. కడప వెంకట సాయి కోచింగ్‌ సెంటర్‌, ప్రొద్దుటూరు సృజన్‌ కోచింగ్‌ సెంటర్‌, జమ్మలమడుగు వివేకానంద జూనియర్‌ సెంటర్స్‌లో డీఎస్సీ పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షులు డి. ఎం. ఓబులేసు యాదవ్‌ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆర్‌ఎస్‌ఎఫ్‌ నిర్వహించిన మోడల్‌ మెగా డీఎస్సీ పరీక్షకు స్పందన వచ్చిందన్నారు. అభ్యర్థులకు ఈ డీఎస్సీ పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యువ న్యాయవాది సూర్య వంశీ యాదవ్‌, ఆర్‌ఎఫ్‌ఎస్‌ జిల్లా ఉపాధ్యక్షులు శివ, నాయకులు వెంకట సుబ్బయ్య, ప్రవీణ్‌ తదితరులు పాల్గొన్నారు.

చేనేత స్టాళ్ల ఏర్పాటు

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : కడపలో టీడీపీ మహానాడు మంగళవారం ప్రారంభమైంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నేతన్నలు 11 స్టాళ్లను మహానాడు ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ స్టాళ్లను రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్‌.సవిత సందర్శించారు. ప్రతి స్టాల్‌ దగ్గరికి వెళ్లి... ఏయే ప్రాంతం నుంచి వచ్చారో అడిగి తెలుసుకున్నారు. వస్త్రాల నాణ్యత, తయారీ గురించి ఆరా తీశారు. చేనేత రంగ అభివృద్ధికి సీఎం చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలను, అమలు చేస్తున్న పథకాల గురించి నేతన్నలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె రూ.10 వేల విలువ చేసే చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. తనతో పాటు వచ్చిన అనుచరులతోనూ చేనేత వస్త్రాలు కొనుగోలు చేయించారు. అనంతరం అక్కడే డ్వాక్రా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన ఫుడ్‌, ఇతర స్టాళ్లను కూడా మంత్రి సవిత పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మెగా బైబిల్‌ ఎగ్జిబిషన్‌ అండ్‌ సేల్‌



ఎగ్జిబిషన్‌ అండ్‌ సేల్‌ను ప్రారంభిస్తున్న దైవ సేవకులు టీడీ ప్రసన్నకుమార్‌

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : కడప నగరం రాజారెడ్డివీధిలోని కృపా చర్చిలో మంగళవారం మెగా బైబిల్‌ ఎగ్జిబిషన్‌ అండ్‌ సేల్‌ను దైవ సేవకులు, చర్చి వ్యవస్థాపకులు టీడీ ప్రసన్నకుమార్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్‌లో 50 రకాల బైబిల్స్‌ వివిధ సైజుల్లో ఉన్నాయన్నారు. ఈనెల 29వ తేదీ వరకు కొనసాగే ఈ ఎగ్జిబిషన్‌లో బైబిల్‌ నిఘంటువులు, బైబిల్‌ కవర్లు, గిఫ్ట్‌ ఆర్టికల్స్‌, వివిధ రచయితల పుస్తకాలు, ఇతర వస్తు సామాగ్రి అందుబాటులో ఉంచారన్నారు. విశ్వాసులు ఎగ్జిబిషన్‌ను సందర్శించి తమకు కావాల్సిన సామాగ్రిని కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్‌ నిర్వాహకులు రవికుమార్‌, సుభాషిణి, రాష్ట్ర హౌసింగ్‌ కార్పొరేషన్‌ మాజీ డైరెక్టర్‌ వైవీ డేవిడ్‌ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆల్‌ ఇండియా ముస్లిం పర్సనల్‌ లా బోర్డు సభ్యులు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: వక్ఫ్‌ చట్టం ఎవరికి చుట్టం అని వక్ఫ్‌ పరిరక్షణ జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌ మహమ్మద్‌ రఫీ అన్నారు. మంగళవారం నగరంలోని కడప ఇస్లామిక్‌ వెల్ఫేర్‌ సొసైటీ కార్యాలయంలో ‘చట్టం ఎవరికి చుట్టం’ అనే ఆల్‌ ఇండియా ముస్లిం పర్సనల్‌ లా బోర్డు ఆధ్వర్యంలో ముద్రించిన పుస్తకాన్ని అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ముస్లింల ఐక్యతను దెబ్బతీయడం కోసం అయోధ్య సమస్య తీసుకురావటం, 370 రద్దు చేయడం, త్రిబుల్‌ తలాక్‌ అంశాన్ని తీసుకురావటం, హిజాబ్‌ అంశాన్ని తీసుకురావటం వెనుక ఒక మత రాజకీయ పార్టీ చేస్తున్న కుట్ర తప్ప వేరేది ఏమీ లేదన్నారు. అందుకని వక్ఫ్‌ చట్టం ఎవరికి చుట్టం? అనే పుస్తకాన్ని అత్యధికంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ సమావేశంలో ఆల్‌ ఇండియా ముస్లిం పర్సనల్‌ లా బోర్డు రాష్ట్ర నాయకులు ఇషాక్‌ అలీ, మత గురువు అక్బర్‌ అలీ రసాది, వక్ఫ్‌ బోర్డు పరిరక్షణ కమిటీ కన్వీనర్‌ అహ్మద్‌ బాబు బాయ్‌, నగర కన్వీనర్‌ మౌలానా జాకీర్‌ హుస్సేన్‌, కో కన్వీనర్స్‌ షేక్‌ మక్బూల్‌ బాషా బహుద్దీన్‌ హిధాయతుల్లా షబ్బీర్‌, ఆబిద్‌ హుస్సేన్‌ అబ్దుల్‌ సత్తార్‌, జాబీర్‌ అలీ ఖాన్‌, జిలాని జమాయితే ఇస్లామిక్‌ హింద్‌ జిల్లా అధ్యక్షులు రహమతుల్లా, నాయకులు షాకీర్‌ హుస్సేన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పదోన్నతిలో రిజర్వేషన్లు అమలు చేయాలి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ నాయకులు

కడప ఎడ్యుకేషన్‌: జిల్లాలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ పదోన్నతిలో రిజర్వేషన్లు పక్కగా అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మేకల శివార్జున కోరారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ షేక్‌ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ప్రధానోపాధ్యాయుల, ఉపాధ్యాయుల ప్రమోషన్లలో రిజర్వేషన్లు పారదర్శకంగా జరపాలని కోరారు. ఏ ఏ క్యాడర్లో ఎంత మంది ఎస్సీ, ఎస్టీ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారో, బహిర్గత పరుస్తూ డీఈఓ వెబ్‌సైట్‌లో పొందుపరచి ఉపాధ్యాయ సంఘాలకు కూడా అందుబాటులో ఉంచాలని కోరారు. అడేక్వసీని కూడా బహిర్గత పరచాలన్నారు. ప్రమోషన్లలో రిజర్వేషన్లు రోస్టర్‌ కం మెరిట్‌ పద్ధతిలో ఇవ్వాలని అన్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుదర్శన్‌ బాబు మేండ్రగుత్తి గంగరాజు, జిల్లా కార్యదర్శి కట్టా గంగాధర్‌ పాల్గొన్నారు.

బదిలీలలో సాంకేతిక సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్‌: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులలో ఎటువంటి అవాంతరాలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని దీంతోపాటు సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని ఎస్టీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌ రామాంజనేయులు, జిల్లా ఎస్టీఎఫ్‌ అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు కోరారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ షేక్‌ షంషుద్దీన్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీలకు దరఖాస్తు చేసిన స్కూల్‌ అసిస్టెంట్లు, సెకండ్‌ గ్రేడ్‌ ఉపాధ్యాయులకు సాంకేతిక పరంగా పాయింట్లు విషయంలో ఇబ్బందులు ఉంటే వెంటనే సవరించి తగిన న్యాయం చేయాలని కోరారు. దీనిపై డీఈఓ మాట్లాడుతూ బదిలీలకు దరఖాస్తు చేసిన స్కూల్‌ అసిస్టెంట్లకు ఏవైనా తప్పులు దొర్లి ఉంటే తగిన ఆధారాలతో ఈనెల 28వ తేదీ గ్రీవెన్స్‌లో నమోదు చేయాలని, తగిన న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మజ్జారి చెన్నకేశవులు, రెడ్డి బాబు ఉన్నారు.

వృద్ధురాలు పిచ్చమ్మకు తాత్కాలిక పునరావాసం



వృద్ధురాలు పిచ్చమ్మకు తాత్కాలిక పునరావాసాన్ని కల్పించిన వామపక్ష నాయకులు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: వడ్డీ వ్యాపారస్తులు ఇంటిని సైతం కూల్చివేయడంతో సర్వస్వం కోల్పోయిన శివానందపురానికి చెందిన పిచ్చమ్మ కుటుంబానికి రెడ్‌ క్రాస్‌ సొసైటీ వారి సహాయంతో తాత్కాలిక పునరావాసాన్ని ఏర్పాటు చేసినట్లు సీపీఐ నగర కార్యదర్శి యస్‌. వెంకట శివ, ఆర్పిపి నేత ప్రసాద్‌ పేర్కొన్నారు. రెడ్‌ క్రాస్‌ సొసైటీ వారిచ్చిన ఫ్యామిలీ టెంటును మంగళవారం శివానందపురంలోని పిచ్చమ్మ కు తాత్కాలిక పునరావాసాన్ని వారి స్వస్థలంలోనే ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిచ్చమ్మ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. కాల్‌ మనీ దందా సృష్టించిన ఫోర్జరీ పత్రాల ఆధారంగా దళిత వృద్ధురాలు పిచ్చమ్మకు న్యాయం చేయడంలో నిర్లక్ష్యం వహించిన రిమ్స్‌ సిఐ, ఎస్‌ ఐ లను వెంటనే సస్పెండ్‌ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి మద్దిలేటి, వడ్ల భాగ్యలక్ష్మి, ఆర్పీపీ నాయకులు తస్లిం, విజయ్‌ కుమార్‌, స్థానికులు అంకయ్య, సంటయ్య, మల్లికార్జున గుండయ్య, వెంకటసుబ్బయ్య, సతీష్‌ పాల్గొన్నారు.

మెకానిక్‌ల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ధర్మ

కడప ఎడ్యుకేషన్‌: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టు వీలర్స్‌ మెకానికల్స్‌కు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ది టూ వీలర్‌ మెకానిక్‌ వర్కర్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షులు దాయినేని ధర్మ కోరారు. మంగళవారం కడప నగరంలోని మున్సిపల్‌ మెయిన్‌ హై స్కూల్‌ ఎదురుగా ఉన్న శివ మెకానిక్‌ షాపులో ఆయన మెకానిక్స్‌తో కలిసి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు దాయినేని ధర్మ మాట్లాడుతూ మన రాష్ట్రంలో దాదాపుగా 8 లక్షల మంది మెకానిక్స్‌ అండ్‌ వర్కర్స్‌ ఉన్నారన్నారు. వారిని అసంఘటిత కార్మికులుగా చేర్చాలని ప్రత్యేక కార్పొరేషన్‌ బోర్డును ఏర్పాటు చేసి వాటిల్లో కార్మికులకు స్కిల్‌ నైపుణ్య శిక్షణ ఇప్పించాలని కోరారు. దీంతోపాటు సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మహబూబ్‌ బాషా, నగర ఉపాధ్యక్షుడు లయన్‌ పటాన్‌, కార్యదర్శి శివ, ట్రెజరర్‌ రమణ, వల్లి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

నేడు మోడల్‌ డీఎస్సీ

కడప ఎడ్యుకేషన్‌: భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో బుధవారం మెగా మోడల్‌ డీఎస్సీ నిర్వహించనున్నామని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్‌ తెలిపారు. మంగళవారం కడపలోని జిల్లా కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలు కడపలో వెంకట సాయి కోచింగ్‌ సెంటర్‌, యూటీఎఫ్‌ ఆఫీస్‌లో, ప్రొద్దుటూరు సుజన్‌ కోచింగ్‌ సెంటర్‌, బద్వేల్‌ గౌతమ్‌ జూనియర్‌ కాలేజ్‌, జమ్మలమడుగు ఎస్వీ డిగ్రీ కాలేజ్‌లో నిర్వహించనున్నామన్నారు. పరీక్ష ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందన్నారు. 9912758515, 9059414222 నెంబర్లను సంప్రదించాలని అన్నారు. పరీక్ష కేవలం ఎస్‌ జి టి అభ్యర్థులకు మాత్రమేనని తెలిపారు.

జిల్లాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: జిల్లాలో నెలకొన్న సమస్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐసీసీ కో–ఆర్డినేటర్‌ సత్తార్‌ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని వైఎస్‌ఆర్‌ మెమోరియల్‌ ప్రెస్‌ క్లబ్‌లో ‘ఒక వైపు మహానాడు –మరొకవైపు మహాగోడు అనే ‘కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లా పరిస్థితి ఎలా ఉందంటే ‘ఒక వైపేమో మహానాడు–మరొక వైపేమో మహా గోడులా ఉందన్నారు. ఎన్టీఆర్‌ జయంతిని పురస్కరించుకుని ఈనెల 27, 28 ,29 తేదీల్లో టీడీపీ మహానాడు కడప జిల్లాలో ఏర్పాటు చేసిందని, తెలుగుదేశం పార్టీ కూటమి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 11 నెలలు అయినా పథకాలు అమలు చేయలేదన్నారు. రాష్ట్ర విభజన జరిగి 11 సంవత్సరాలు పూర్తికావస్తూ ఉందన్నారు. ఈ మధ్యకాలంలో కడప జిల్లాకు అనేక అన్యాయాలు జరిగాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా మాజీ ఉపాధ్యక్షులు–గౌస్‌ మొహిద్దీన్‌, ఇమామ్‌, మహబూబ్‌ బాషా తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు షుగర్‌ ఫ్యాక్టరీని పునః ప్రారంభించాలి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్‌

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: జిల్లాలో మూసివేసిన చెన్నూరు షుగర్‌ ఫ్యాక్టరీని, ప్రొద్దుటూరు పాల కేంద్రాన్ని పునః ప్రారంభించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్‌ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహానాడు వేదికగా జిల్లాలో మూసివేసిన పరిశ్రమలను పునః ప్రారంభించి కడప జిల్లా ప్రజల మన్ననలను పొందాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను, పంట కాలువలను సత్వరమే పూర్తి చేసి నిత్యం కరువుతో అల్లాడుతున్న జిల్లా రైతాంగాన్ని వారి పంట పొలాలకు నీరిచ్చి ఆదుకోవాలన్నారు. ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభమవుతున్నందున ప్రభుత్వ వాగ్దానం ప్రకారం పెట్టుబడి ఖర్చులకు గాను ప్రతి రైతుకు రూ.20వేలను వెంటనే అందించాలని, 90 శాతం సబ్సిడీతో సాగుకు విత్తనాలు , 50శాతం సబ్సిడీతో వ్యవసాయ యంత్రాలను రైతులకు అందించాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి. రామ్మోహన్‌ రెడ్డి, జిల్లా నాయకులు పక్కీరప్ప పాల్గొన్నారు.

కొనసాగుతున్న మహాభారత యజ్ఞం

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానది ఒడ్డున వెలసియున్న శ్రీ మల్లూరమ్మ ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న మహాభారతయజ్ఞం కార్యక్రమం వైభవంగా సాగుతోంది. ప్రముఖ భాగవతారిణి సీతామహాలక్ష్మి ద్రౌపతి స్వయంవరం, బకాసురవధ కార్యక్రమాలను మంగళవారం వివరించారు. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహానాడు చిత్రాలు



కడప నగర సమీపంలో ఏర్పాటు చేసిన మహానాడు స్వాగత కూడళ్లు



మహానాడు సందర్భంగా పోలీసుల బందోబస్తు



మహానాడు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చేనేత స్టాళ్లు



టీడీపీ హోర్డింగ్‌ నేలకూలిన దృశ్యం